క్లుప్తంగా

వరసిద్ధునికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి దాతలు రూ.2,00,132లు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన వెల్లా రాకేష్ కుమార్ ఇక్కడ నిత్యాన్నదానానికి రూ.1,00,016, వీవీఎస్ఆర్కె.ప్రసాద్ గో సంరక్షణ ట్రస్ట్ కు రూ.1,00,116 చొప్పున అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గాలీవానకు విద్యుత్ కట్!

చిత్తూరు కార్పొరేషన్: గాలీవానకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శుక్రవారం శుక్రవారం సాయంత్రం గాలీవాన మూలాన పలు ప్రాంతాల్లో కరెంటు తీగలపై కొమ్మలు పడటంతో ట్రిప్పింగ్ సమస్య తలెత్తింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు, దుకాణదారులు ఇబ్బంది పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లు పడటంతో వాటిని తొలగించి విద్యుత్ పునరుద్ధణకు గంటల సమయం పట్టింది. మురుగునీరు రోడ్డు పైకి ప్రవహించడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



కూరగాయలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి పలమనేరు చెందిన రవీంద్ర రెడ్డి బృందం రూ. 2 లక్షల విలువ గల కూరగాయలను శుక్రవారం వితరణ చేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వసంతాపురం, గుడిపాలలో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి బోండాలు, నీటితొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు రోజులు తరబడీ నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇళ్లలో నీటినిల్వలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జబసెలియ, సీహెచ్ఓ ఉమామహేశ్వరి, సిబ్బంది సుజిమ, స్వప్న పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

గుడుపల్లె: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్‌ను లారీతో సహా పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం మండలంలోని కమ్మగుట్టపల్లె వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు సమీపంలోని క్వారీల నుంచి తమిళనాడు రాష్ట్రానికి వెళ్తున్న గ్రానైట్ లారీని నిలిపి, ఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు తెలుసుకుని సీజ్ చేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గంగాధర నెల్లూరు: మండలంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం చెన్నైకి చెందిన ఎంఎస్ హాస్పిటల్, సీఎస్ఐ పాల్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు కుట్టి తెలిపారు. ఎంఎం హాస్పిటల్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

● డ్వామా పీడీ రాజశేఖర్



మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ, నాయకులు, అధికారులు

బంగారుపాళెం: మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం బంగారుపాళెం ఇందిరమ్మ కాలనీ వద్ద వన మహోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపుకు కృషి చేయాలని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను పెంచాలని కోరారు. అలాగే అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయరాదని, సంరక్షణకు పాటుపడాలన్నారు. వన్యప్రాణులకు ఆవాసాలైన అడవుల్లో పచ్చదనం తగ్గితే భావితరాలు భారీమూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, సర్పంచ్ ఉమాదేవి, ఉప సర్పంచ్ కామరాజు, ఎంపీడీఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీ

చిత్తూరు కార్పొరేషన్: వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని నగరవనంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మొక్కలు నాటారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, కేరళలో భూమిపై పటుత్వం ఉన్న చెట్లను పెంచక పోవడంతో పెను విలయం సంభవించిందని వయనాడ్ ఉదంతం గురించి పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విరివిగా మొక్కలు నాటి, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, సోషల్ ఫారెస్టు డీఎఫ్ఓ సోమశేఖర్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎఫ్ఆర్వో థామస్, ఎఫ్ఎస్ఓ ఉష, ఎఫ్‌బీఓ మధు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చిత్తూరు ఎంపీ

మారేడుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'





మారేడుపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక, గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

తవణంపల్లె: గర్భవతులు ఆస్పత్రిలో ప్రసవించడం వల్ల తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని మారేడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. తవణంపల్లె పీహెచ్‌సీలో కాన్పులు చేస్తున్నామని, గర్భవతులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లరాదని కోరారు. గ్రామస్తులకు అంటువ్యాధుల గురించి అవగాహన కలిగించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. జ్వరాల బారిన పడితే రక్తపరీక్షలు చేయించుకుని ఏ జ్వరమో నిర్ధారణ అయ్యాక పూర్తి స్థాయిలో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతగుంటూరులో..

గుడిపాల: మండలంలోని చింతగుంటూరులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం వైద్యాధికారిణి డాక్టర్ రష్మిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మంచం పట్టిన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



దిగువమోదలపల్లెలో నీటి తొట్టెలో లార్వాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



దిగువమోదలపల్లె పాఠశాలలో విద్యార్థుల రక్త నమూనాలను సేకరిస్తున్న ఆశా కార్యకర్తలు

తవణంపల్లె: మండలంలోని అరగొండ, పైమాఘం, దిగువమోదలపల్లె, వడ్డిపల్లె, మోదలపల్లె దళితవాడ తదితర గ్రామాల్లో ప్రజలకు పారిశుద్ధ్యంపై అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామాల్లో ఇంటింటా పర్యటించారు. తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇళ్ల మధ్య ఉన్న మురుగు నీటి గుంతల్లో లార్వాల నిర్మూలనకు మందులు పిచికారీ చేయించారు. అనంతరం మోదలపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రక్తనమూనాలు సేకరించి వారి బరువును పరిశీలించి నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



బాలు విసురుతున్న ఎంఈవో

నగరి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి మండలంలోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఖో–ఖో, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించారు. ఎంఈవో శ్రీదేవి పర్యవేక్షించారు.

సైన్స్, హిందీ టీచర్లు ఇంగ్లిష్ చెప్పాలట!

పలమనేరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా హిందీ సబ్జెక్ట్ బోధిస్తున్న ఉపాధ్యాయురాలిని ఇకపై ఇదే మండలంలోని కొలమాసనపల్లె హైస్కూల్‌లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించాలని విద్యాశాఖ ఆదేశించింది.

గంగవరం మండలం కల్లుపల్లె హైస్కూల్‌లోని ముగ్గురు సోషియల్ టీచర్లను హిందీ, ఆంగ్లం బోధించాలని పొన్నమాకులపల్లె, చిన్నమనాయునిపల్లెకు బదిలీ చేశారు. ఇదీ విద్యాశాఖ 'సర్దుబాటు' లీలలు..!

- ఉర్దూ టీచర్లు సాంఘిక శాస్త్రం పాఠాలు చెప్పాలని ఆదేశాలు
- అసంబద్ధంగా టీచర్ల సర్దుబాటు ప్రక్రియ
- ఇలాగేనా టీచర్ల కొరత తీర్చేదని మండిపడుతున్న టీచర్లు

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు పూనుకుంది. తొలినుంచీ సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు నిరసిస్తున్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోకుండా అసంబద్ధంగా సర్దుబాట్లు చేస్తుండటంతో టీచర్లకు చిర్రెత్తుతోంది. పలమనేరు నియోజకవర్గంలో జరుగుతున్న టీచర్ల సర్దుబాటు ప్రక్రియ దీనికి అద్దం పట్టింది. స్థానికంగా సర్దుబాట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. పదేళ్లుగా బయాలజీ, హి హిందీ సబ్జెక్టులు చెబుతున్న టీచర్లను సాంఘిక శాస్త్రం పాఠాలు చెప్పాలని పంపారు. ఇలా చేస్తే విద్యాప్రమాణాలు మెరుగుపడడం దేవుడెరుగు అసలు తమకు సంబంధం లేని పాఠాలను వీరు ఎలా బోధిస్తారనే ఇంగిత జ్ఞానం ఉండాల్సిన పనిలేదా? అని టీచర్లే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన ఉద్యోగోన్నతులు, సర్దుబాట్లు సైతం 2022 నిబంధనల మేరకు సాగాయి. కానీ ఇప్పుడు బీఈడీలో మెథడాలజీని బట్టి ఇష్టానుసారంగా సబ్జెక్టులను మార్చడంతో ఉపాధ్యాయులకు దిక్కు తోచడం లేదు. 20 ఏళ్లుగా హిందీ పాఠాలు చెబుతున్న టీచర్‌ను ఉన్నపళాన మరో స్కూల్‌లో ఆంగ్లం బోధించాలని పంపడం గందరగోళంగా మారింది.

ఎనిమిది తరగతులకు సోషల్ టీచరే ఒక్కరే!

ఇప్పుడు జరుగుతున్న సర్దుబాటు కారణంగా ఓ సోషల్ టీచర్ ఎనిమిది తరగతులకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి బదులు అర్హులైన టీచర్లకు ఉద్యోన్నతులు కల్పించి సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరతను అధిగమించే అవకాశం ఉన్నప్పటికీ విద్యాశాఖ ఎందుకు ఇలా వ్యవహరిస్తుందో అంతుబట్టడం లేదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

కుప్పంపై ఎందుకంత ప్రేమో!?

మరోవైపు పలమనేరు ప్రాంతంలో పట్టణానికి ఆనుకుని కొన్ని ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. తక్కువగా విద్యార్థుల సంఖ్య ఉంటూ ఎక్కువమంది టీచర్లు స్కూళ్ల నుంచి టీచర్లను కుప్పంలోని గ్రామీణ పాఠశాలలకు బదిలీ చేస్తున్నారు. కేవలం అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం చంద్రబాబు మెప్పు పొందడం కోసం జిల్లా విద్యాశాఖ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందనే విమర్శలొస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ అసంబద్ధ సర్దుబాట్లపై ఆందోళనలకు సన్నద్ధమవుతోంది.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు..

చిత్తూరు కలెక్టరేట్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు టెక్నాలజీపై పట్టు పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ మాట్లాడుతూ, ప్రాంగణంలో బీసీ వసతి గృహం, జిల్లా కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు వెంకటేశ్వరచౌదరి, బీజేపీ నాయకులు జగదీశ్వరనాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



సుబ్రమణ్యం యాదవ్(ఫైల్)

గుడిపాల: మండలంలోని 197రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, విశ్రాంత లైన్‌మ్యాన్ సుబ్రమణ్యం యాదవ్ శుక్రవారం మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వరసిద్ధుని దర్శించుకున్న మంత్రి

కాణిపాకం: రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శుక్రవారం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

మ్యాథ్స్ లెక్చరర్ పోస్టు భర్తీకి చర్యలు

పూతలపట్టు: ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేయవచ్చని ప్రభుత్వం అనుమతించిందని, ఈ మేరకు ఖాళీగా తమ కాలేజీలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక పోస్టును భర్తీ చేయనున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ మ్యాథ్స్ చేసిన వారు అర్హులని, వారు వచ్చే నెల 2వ తేది తమ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963463863 సెల్‌నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. రాగి వైరు చోరీ



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సదుం: ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేసిన సంఘటన శుక్రవారం మండలంలో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఊటుపల్లె పంచాయతీ తుమ్మగుంటపల్లెకు చెందిన కృష్ణమనాయుడు పొలాల వద్ద ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, అలాగే నీరుగట్టువారిపల్లెకు చెందిన బయన్న పొలం వద్ద 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును దొంగలు చోరీ చేశారు. దీనిపై బాధిత రైతులు పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు.

తెలుగు భాషా పురస్కారాల్లోనూ వివక్షేనా?

పలమనేరు: తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గిడుగు రామమూర్తి పంతుల పేరిట ప్రదానం చేసిన తెలుగు భాషా పురస్కారాల్లోనూ వివక్ష చూపిందని పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అన్ని ప్రాంతాలకు సమతూకాన్ని పాటిస్తూ 41మందికి సేవా పురస్కారాలను అందజేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 19మందికి మాత్రమే పురస్కారాలను ప్రకటించి ప్రదానం చేయడం సరికాదని ఆక్షేపించారు.

ఇసుక లారీలు సీజ్



గంగాధర నెల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసుల సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి గంగాధర నెల్లూరు మీదుగా చెన్నైకి ఇసుక తరలిస్తున్నట్లు సీఐ లక్ష్మన్నకు ముందుగా సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీల సమాచారాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశారు.

గ్రామోత్సవంతో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం

బంగారుపాళెం: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని బంగారుపాళెంలో ఐదు రోజుల కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం గ్రామోత్సవంతో ముగిశాయి. స్థానిక రాజావీధిలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. మంగళ హారతులు ఇచ్చారు. తీర్థప్రసాదాల వితరణతో పాటు భగవద్గీత శ్లోకాలు వినిపించారు. చివరి రోజు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకిపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలతో కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు, కృష్ణభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో చిన్నారుల కోలాట ప్రదర్శన

ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా పురస్కారం



క్రీడా ప్రతిభ అవార్డులను చూపుతున్న హెచ్ఎం కోమల, పీడీ దేవానంద్

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల్లో 281 పాయింట్లు సాధించడంతో క్రీడా ప్రతిభ అవార్డు దక్కిందని శుక్రవారం ఆ స్కూల్ హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ, 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల్లో జాతీయ, రాష్ట్ర, జోనల్స్‌లో అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరచినందుకు క్రీడా ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారని తెలిపారు. తమ పాఠశాల వరుసగా మూడోసారి మొదటి స్థానం సాధించి పురస్కారానికి ఎంపికైందని, గురువారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని చిత్తూరు మెసానికల్ క్రీడా మైదానంలో పీడీతో కలిసి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. పీడీ దేవానంద్, క్రీడాకారులను ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద ఏపీసీటీఎస్ఏ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అక్రమాలు, రాష్ట్ర ఉన్నతాధికారుల అవినీతిపై దర్యాప్తు చేయాలన్నారు. ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. జీఎస్టీఓలకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, ఉద్యోగుల బదిలీల గడువు పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పూర్ణం, నాయకులు గిరిధర్, జగదీష‌బాబు, సురేష్‌బాబు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.